# చేవెళ్ల గడ్డపై.. బీసీల సత్తా చాటుదాం

## బీసీ బిడ్డ కాసాని జ్ఞానేశ్వర్‌కే మా సంపూర్ణ మద్దతు
## అహంకారపూరిత నేతలకు చరమగీతం పాడుదామని పిలుపునిస్తున్న బీసీ నేతలు



చేవెళ్ల లోక్‌సభలో బీసీలకు వచ్చిన అవకాశాన్ని చేజార్చుకోవద్దని బీసీ సంఘాలు పేర్కొంటున్నాయి. కాంగ్రెస్ పాలనలో బీసీలు ఎదుర్కొన్న కష్టాలను తల్చుకుని నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీసీ అభ్యర్థిని గెలిపించుకోకపోతే ఎదురయ్యే పరిస్థితులు ఊహించుకుంటేనే భయంగా ఉందని ఆందోళన వెలిబుచ్చుతున్నారు. ఈ ఎన్నికల్లో బీసీల సత్తా చూపి అహంకారపూరిత నేతలకు చరమగీతం పాడుదామని పిలుపునిస్తున్నారు. చేవెళ్లలో బీసీలకు అందివచ్చిన ఈ అవకాశాన్ని బీసీల్లోని అన్ని కులాలవారు సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీ వర్గాలకు ఇచ్చిన ప్రాధాన్యత.. లోక్‌సభ ఎన్నికల్లో టికెట్ల కేటాయింపులో బీసీలకు కల్పించిన ప్రాధాన్యతను నేతలు ఈ సందర్భంగా కొనియాడుతున్నారు. బీసీలను అణచివేయాలని చూస్తున్న కాంగ్రెస్, బీజేపీ పార్టీలను నమ్మేది లేదని స్పష్టం చేస్తున్నారు. ఎన్నికల వేళ మాయమాటలు చెప్పి మభ్యపెట్టే ప్రయత్నాలు చేసినా.. తిప్పికొట్టి బీసీ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను అఖండ మెజార్టీతో గెలిపించుకుంటామని స్పష్టం చేస్తున్నారు. అన్ని కులాలు ఐక్యంగా ఉండి కాసానిని ఎంపీగా పార్లమెంటులో కూర్చోబెడతామని కుండబద్దలుకొట్టి మరీ చెబుతున్నారు. – రంగారెడ్డి, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ)

### మన బీసీ నాయకుడికి ఓట్లు వేసి గెలిపించుకుందాం



బీసీలంతా ఏకతాటిపైకి వచ్చి మన బీసీ నాయకుడికే ఓట్లు వేసి గెలిపించుకుందాం. ఎంపీగా జ్ఞానేశ్వర్ గెలుపొందితేనే పార్లమెంట్‌లో మన సమస్యలపై పోరాటం చేసి మనకు న్యాయం చేస్తారు. కొండా, గడ్డం ఎంపీలుగా గెలిచి సొంత ప్రయోజనాల కోసం బీఆర్ఎస్‌ను వదిలి ఇతర పార్టీల్లోకి వెళ్లారు. ఈ ఎన్నికల్లో కాసాని గెలుపొందడం ఖాయం.

– మహేశ్, చేవెళ్ల మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్

### బీసీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి



బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కాసాని జ్ఞానేశ్వర్‌ను పార్టీ అభ్యర్థిగా పోటీ చేయించడం సంతోషకరమైన విషయం. బీసీలను చులకనగా చూస్తున్న నేతలను ఓడించి మన సత్తా చూపిద్దాం. బీసీలకు ప్రాధాన్యత ఇచ్చే పార్టీలకు పట్టం కట్టాల్సిన అవసరం ఉన్నది. పార్టీలకతీతంగా బీసీలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలి.

– ఇమ్రాన్, సింగప్పగూడ, చేవెళ్ల మండలం

### చేవెళ్లను బీసీల అడ్డాగా మారుస్తాం



జ్ఞానేశ్వర్ గెలుపుతో బీసీలకు రాజకీయ గుర్తింపు వస్తుంది. మరింత అభివృద్ధి చెందాలంటే కాసానికి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాల్సిన అవసరం ఉన్నది. జనాభాలో అత్యధికంగా ఉన్న బీసీలమంతా ఏకతాటిపైకి వచ్చి, కాసానిని గెలుపించుకొని చేవెళ్లను బీసీల అడ్డాగా మారుస్తాం. కేసీఆర్ బీసీలకు 50 శాతం టికెట్లు ఇవ్వడం చాలా సంతోషంగా ఉన్నది.

– ప్రవీణ్, మాసన్‌పల్లి, బషీరాబాద్

### మంచి అవకాశం



బీసీలంతా ఒక్కతాటిపైకి వచ్చి బీసీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలుపించుకునేందుకు ఇది మంచి అవకాశం. కాసాని అంటేనే బీసీ కులాలు గుర్తుకు వస్తాయి. బీసీ కులాలను ఏకం చేసిన కాసానిని పార్టీలకతీతంగా ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించి పార్లమెంట్‌కు పంపించాలి. బీసీల సత్తా దేశవ్యాప్తం కావాలంటే కాసాని గెలుపు ఒక్కటే మార్గం.

– అంజిలప్ప, ఇందర్‌చేడ్, బషీరాబాద్ మండలం

### బీసీలంతా ఏకమవ్వాలి



బీసీ నేత కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ గెలుపునకు బీసీలంతా ఏకమవ్వాలి. స్వార్థ ప్రయోజనాల కోసం ప్రజల నమ్మకాలతో ఆడుకునే వ్యాపారవేత్తలకు తగిన బుద్ధి చెబుతూ బీసీల బలాన్ని ఢిల్లీ వరకు తెలిసేలా చేద్దాం. బీసీలతో పాటు మిగతా వర్గాల ప్రజలు సైతం కాసాని గెలుపునకు మద్దతుగా నిలువడం ఖాయం. చేవెళ్ల గడ్డపై ముచ్చటగా మూడోసారి గులాబీ జెండా ఎగరడం పక్కా.

– మల్లేశ్, చందానగర్

### బీసీ నాయకుడిని గెలిపించుకుందాం



బీసీల సంక్షేమం కోసం ఏండ్లుగా పోరాడుతున్న నేత కాసాని జ్ఞానేశ్వర్. ఆయనను భారీ మెజార్టీతో గెలిపించుకునేందుకు అన్ని వర్గాల ప్రజలు మద్దతు పలుకుతున్నారు. వ్యాపారాలు, స్వార్థ రాజకీయాలతో పదవి కోసం పాకులాడే నాన్ లోకల్ లీడర్లకు ఎన్నికల్లో పరాభవం తప్పదు. బీసీలందరూ అప్రమత్తంగా ఉండి కాసాని గెలుపునకు కృషిచేద్దాం.

– శంకరి రాజు ముదిరాజ్, శేరిలింగంపల్లి

### మన ఓటు మనమే వేసుకుందాం



మన ఓట్లు మనమే వేసుకొని బీసీల సత్తా చాటుదాం. బీసీలను తక్కువ చేసి మాట్లాడుతున్న వారికి ఓటుతో బుద్ధి చెబుతాం. బీసీలను గుర్తించి చేవెళ్ల పార్లమెంటుకు బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎంపీ అభ్యర్థిగా కాసాని జ్ఞానేశ్వర్‌కు టికెట్ ఇవ్వడం శుభపరిణామం. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బీసీలకు సముచిత స్థానం కల్పించారు.

– యాతం బాల్‌రాజ్ యాదవ్, సంఘం నాయకుడు, బడంగ్‌పేట

### గులాబీ జెండాను ఎగురవేద్దాం



చేవెళ్ల పార్లమెంటు గడ్డపై గులాబీ జెండాను ఎగురవేద్దాం.. బీసీ నేత కాసాని జ్ఞానేశ్వర్‌ను ఎంపీ అభ్యర్థిగా గెలిపించి పార్లమెంట్‌కు పంపుదాం. బీసీ వాణి, బాణిని వినిపించే ఏకైక గొంతుక కాసాని. గతంలో బీసీల కోసం అనేక ఉద్యమాలు చేశారు. బీసీల కోసం సంవత్సరాల తరబడి పోరాటం చేసిన కాసానికి ఒక్కసారి అవకాశం ఇద్దాం.

– కిరణ్, బీసీ సంఘం నాయకుడు, బడంగ్‌పేట

### కాసానితో బీసీలు ఆర్థికంగా ఎదిగారు



బీసీల సంక్షేమం కోసం కృషిచేసిన వ్యక్తి కాసాని జ్ఞానేశ్వర్. ఆయన చేసిన పోరాటాల ఫలితంగా ఎంతో మంది బీసీలు ఆర్థికంగా ఎదిగారు. ఉమ్మడి రంగారెడ్డిజిల్లా చైర్మన్‌గా పనిచేసి మంచి పేరు తెచ్చుకున్న నాయకుడు జ్ఞానేశ్వర్. అలాంటి వ్యక్తికి ఎంపీ టికెట్ కేటాయించిన కేసీఆర్‌కు ధన్యవాదాలు. బీసీలందరూ ఐకమత్యంగా కలిసి ఎలాగైనా కాసానిని గెలిపించుకుంటాం.

– పరమేశ్, అత్తాపూర్

### ఇంటింటికీ తిరిగి బీసీల మద్దతు కూడగడతాం



బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన బీసీ నేత కాసానిని చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా బీఆర్ఎస్ ప్రకటించడం హర్షణీయం. ఇంటింటికీ తిరిగి బీసీల మద్దతు కూడగడతాం. బీసీలందరూ కారు గుర్తుకు ఓటువేసేలా ప్రచారం చేస్తాం. బీసీ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకొని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకోవాలి.

– రాముయాదవ్, హైదర్‌గూడ

### బీసీల సత్తా చూపిస్తాం



బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీలకు సముచిత ప్రాధాన్యత ఇచ్చి గౌరవించింది. ప్రస్తుతం ఎంపీ అభ్యర్థిగా బీఫామ్ ఇచ్చి గౌరవించారు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్. జనాభాలో సగభాగం ఉన్న బీసీలందరూ కాసానీ జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకోవడం ఒక్కటే మిగిలి ఉన్నది. బీసీలతో పాటు ఇతర కులాలు కూడా జ్ఞానేశ్వర్ గెలుపునకు కృషి చేయాలి.

– ప్రశాంత్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, పూలపల్లి

### బీసీ నేతకు పట్టం కడుతాం



చేవెళ్ల నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కాసాని జ్ఞానేశ్వర్‌కు పట్టం కడుతాం. బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి కేసీఆర్ టికెట్ కేటాయించారు. ఆయనను గెలిపిస్తే సామాజికంగా న్యాయం జరుగుతుంది. కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ సత్తా చూపిస్తాం. బీసీలకు న్యాయం జరిగేందుకు బీసీ నాయకుడిని గెలిపించుకోవాలి.

– మాలె కృష్ణయ్యగౌడ్, మాజీ ఎంపీటీసీ, కులకచర్ల

### కాసాని గెలిస్తేనే సమస్యల పరిష్కారం



కాసాని బడుగు బలహీనవర్గాల ప్రజలకు అండగా ఉంటారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి నిలబెట్టిన జ్ఞానేశ్వర్‌కు ప్రతి ఒక్కరి మద్దతు ఉంటుంది. కాసాని గెలుపు కోసం మా వంతు కృషిచేస్తాం. కాసాని గెలిస్తేనే కేంద్రంలో బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం కృషిచేసేందుకు అవకాశముంటుంది. జ్ఞానేశ్వర్ మచ్చలేని నాయకుడు.


– గుండుమల్ల నర్సింహులు, తిర్మలాపూర్, కులకచర్ల మండలం

### బీసీ బిడ్డను గెలిపించుకుందాం



బీసీలను ఏకం చేసిన నాయకుడు కాసాని. రాష్ట్రంలో 96 కులాలను ఏకతాటిపైకి తీసుకువచ్చి వారి సమస్యలపై పోరాటం చేసిన ఘనత జ్ఞానేశ్వర్‌కు దక్కుతుంది. అలాంటి నాయకుడిని గుర్తించిన కేసీఆర్ ఎంపీ అభ్యర్థిగా అవకాశం కల్పించడం గొప్ప పరిణామం. బీసీల సమస్యలు పరిష్కారం కావాలంటే కాసాని ఎంపీగా గెలవాల్సిందే.

– శ్రీనివాస్‌గౌడ్, నారాయణపూర్, వికారాబాద్



## ఇంద్రారెడ్డికి ఘన నివాళి

ఇంద్రారెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని చేవెళ్ల పట్టణంలోని ఆయన విగ్రహానికి, కౌకుంట్లలోని సమాధి వద్ద మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితారెడ్డి మాట్లాడుతూ దివంగత ఇంద్రారెడ్డి అందరి నుంచి దూరమై 23 ఏండ్లు కావొస్తున్నా ఇంకా ప్రజల గుండెల్లోనే ఉన్నారని కొనియాడారు.

## హనుమాన్ ర్యాలీని విజయవంతం చేయాలి

ఎల్బీనగర్ , ఏప్రిల్ 22: హనుమాన్ జయంతి సందర్భంగా ఎల్బీనగర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం నిర్వహించే ర్యాలీని విజయవంతం చేయాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఒక ప్రకటనలో కోరింది. వనస్థలిపురం రామాలయం నుంచి సాహెబ్‌నగర్ త్రినేత్ర ఆంజనేయ స్వామి దేవాలయం వరకు సాగే హనుమాన్ జయంతి ర్యాలీలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

**హయత్‌నగర్‌లో..**

హయత్‌నగర్, ఏప్రిల్ 22 : హనుమాన్ జయంతి సందర్భంగా మంగళవారం సాయంత్రం 5 గంటలకు హయత్‌నగర్ వీరన్నగుట్టలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయం నుంచి హనుమాన్ శోభాయాత్ర జరుగుతుందని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శోభాయాత్ర వీరన్నగుట్ట, హయత్‌నగర్ ఓల్డ్ విలేజ్, రాఘవేంద్రనగర్ కాలనీ, అరుణోదయ కాలనీ, సుభద్రనగర్, శారదానగర్ హనుమాన్ టెంపుల్, కమలానగర్, వనస్థలిపురంలోని గణేశ్ టెంపుల్ వరకు హనుమాన్ భక్తులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. శోభాయాత్రలో భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

## 'కాసాని' నామినేషన్‌కు భారీగా తరలి రావాలి



జయేందర్ ముదిరాజ్

కందుకూరు, ఏప్రిల్ 22 : చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ నామినేషన్ కార్యక్రమానికి తరలిరావాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్ ముదిరాజ్ కోరారు. మంగళవారం ఉదయం 10గంటలకు రాజేంద్రనగర్‌లోని తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్ వేస్తారని చెప్పారు. కార్యక్రమానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డితో పాటు పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రానున్నట్లు పేర్కొన్నారు. మండల పరిధిలోని బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు, పార్టీ మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నామినేషన్ దాఖలు



తరలివెళ్తున్న నాయకులు

ఎల్బీనగర్ , ఏప్రిల్ 22 : మల్కాజ్‌గిరి పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డి నామినేషన్ దాఖలు కోసం సోమవారం ఎల్బీనగర్ చౌరస్తా నుంచి ఎల్బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఎల్బీనగర్‌లో ర్యాలీని ఎల్బీనగర్ నియోజకవర్గం సీనియర్ కాంగ్రెస్ నాయకులు ముద్దగౌని రామ్మోహన్ గౌడ్, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ముద్దగౌని లక్ష్మీ ప్రసన్న, వజీర్ ప్రకాశ్ గౌడ్, మల్లారపు శాలిని. బద్దుల వెంకటేశ్ యాదవ్, ఎస్వీ కృష్ణ ప్రసాద్, సునీల్ బాబు, కత్తుల రాంబాబుతో పాటుగా పదకొండు డివిజన్ల ప్రధాన నాయకులు పాల్గొన్నారు.

## ఆలయ పునర్నిర్మాణం అభినందనీయం



పోచమ్మ ఆలయ పునర్నిర్మాణ కార్యక్రమంలో పాల్గొన్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చంపాపేట, ఏప్రిల్ 22: పోచమ్మ ఆలయ పునర్నిర్మాణం చేపట్టడం అభినందనీయమని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ దుర్గానగర్ కాలనీలోని పోచమ్మ దేవి ఆలయంలో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సింహవాహనం, బలిపీఠం, పోతలింగం, శిఖరం నూతన ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు. ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు చీర శ్రీనివాస్, సభ్యులు సురేశ్, ఇమ్మిడి బీరప్ప, గణేశ్, సిద్దాల నరసింహ, బెజవాడ గణేశ్, ఇమ్మిడి శ్రీశైలం, ఇమ్మిడి రాములు, ఇమ్మిడి సంగమయ్య, శ్రీశైలం, శివకుమార్, తిరుమలేశ్, పోచయ్య, రవి, ఓంప్రకాశ్, ఇమ్మిడి కృష్ణ, జంగయ్య, నాయకులు కృష్ణమాచారి, గోగిరెడ్డి అంజిరెడ్డి, సదానందరెడ్డి, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఇంద్రారెడ్డి సేవలు మరువలేనివి



ఇంద్రారెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న మహేందర్‌రెడ్డి, నాయకులు

కందుకూరు, ఏప్రిల్ 22 : మాజీ హోంమంత్రి దివంగత ఇంద్రారెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలని బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు సామ మహేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం వర్ధంతి సందర్భంగా ఇంద్రారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంద్రారెడ్డి అడుగు జాడల్లో ఎమ్మెల్యే మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి నడుస్తున్నట్లు తెలిపారు. ఆయన చేసిన సేవలు మరువలేనివని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తాగునీరు కలుషితం కాకుండా చూడాలి



బాలాజీ కాలనీలో డ్రైనేజీ సమస్యలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

ఎల్బీనగర్ , ఏప్రిల్ 22: కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్ బాలాజీకాలనీలో సమస్యలను కార్పొరేటర్ పవన్‌కుమార్ పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీలో డ్రైనేజీ , తాగునీరు కలుషితమై వస్తుందని స్థానికులు చేసిన ఫిర్యాదు మేరకు డ్రైనేజీ సమస్యలను పరిశీలించారు. వెంటనే జలమండలి అధికారులతో మాట్లాడి తాగునీరు కలుషితం కాకుండా తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాలనీవాసులు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కాలనీలను శుభ్రంగా ఉంచుకోవాలి



కాలనీవాసులతో కలిసి కమలానగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి

హయత్‌నగర్, ఏప్రిల్ 22 : డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేవిధంగా చూసుకోవాలని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి సూచించారు. సోమవారం హయత్‌నగర్ డివిజన్‌లోని కమలానగర్‌లో పారిశుధ్య కార్మికుల పనితీరుపై కాలనీవాసులను అడిగి కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి తెలుసుకున్నారు. ఆయన వెంట బీజేపీ డివిజన్ అధ్యక్షుడు ఉగాది ఎల్లప్ప, ప్రధాన కార్యదర్శి గోవిందచారి, కాలనీ అధ్యక్షుడు టీవీ రావు, ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, ప్రధానకార్యదర్శి సుబ్బారావు, దివాకర్, లింగం, పుష్ప, రంజలి తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ గెలుపు ఖాయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

చర్లపల్లి, ఏప్రిల్ 22 : వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు ఖాయమని ఉప్పల్ నియోజకవర్గం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఏఎస్‌రావునగర్ డివిజన్ పరిధిలోని మార్కండేయనగర్, పద్మశాలి కమ్యూనిటీ హాల్‌లో మల్కాజిగిరి నియోజకవర్గం పార్లమెట్ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపు కోసం ఉప్పల్ నియోజకవర్గం ఎన్నికల ఇన్‌చార్జి జహింగీర్ పాషా, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ శిరీషసోమశేఖర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కాసం మహిపాల్‌రెడ్డిలతో కలిసి నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్‌కు అత్యధిక మెజారిటీ అందించేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు.

## నాదర్‌గుల్ వార్డు కార్యాలయాన్ని కాపాడాలి

బడంగ్‌పేట,ఏప్రిల్22: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్ పాత గ్రామ పంచాయతీ (వార్డు కార్యాలయం) కబ్జాకు గురవుతున్నట్లు మాజీ ఎంపీటీసీ కందాడి శ్రీరాం రెడ్డి మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. నాదర్‌గుల్‌లో ఉన్న గ్రామ పంచాయతీని కొంత మంది కబ్జా చేయడంపై ఆయన మండి పడ్డారు. కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పార్టీలకతీతంగా వార్డు కార్యాలయాన్ని కాపాడుకోవలసిన బాధ్యత ఉందన్నారు. ఈ విషయం పై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. కార్పొరేషన్ అధికారులు చొరవ తీసుకోవాలని కోరారు.

## బీమా సేవలు వినియోగించుకోవాలి



ఎల్ఐసీ పత్రాలను అందజేస్తున్న వెంకటరమణారెడ్డి

కందుకూరు. ఏప్రిల్ 22 : బీమా సేవలను సద్వినియోగం చేసుకోవాలని భారతీయ బీమా (ఎల్ఐసీ ) సంస్థ ప్రతినిధి వెంకటరమణారెడ్డి తెలిపారు.మండల పరిధిలోని దెబ్బడగూడ గ్రామానికి చెందిన మల్లేపల్లి సదానంద అకాలంగా మృతి చెందాడు. మృతుడు కుటుంబ భద్రత కోసం బీమా చేశారు. దీంతో వారి కుంటుంబాన్ని ఆదుకోవడానికి కుటుంబ సభ్యులకు భద్రత పత్రాలను అం ద జేశారు. ఈ కార్యక్రమంలో ఏజెంట్ అమ్రాబాద్ మనోహర్ గుప్తా, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో స్నాతకోత్సవం



గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న చిన్నారులు

సైదాబాద్, ఏప్రిల్ 22 : ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని సాయినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో చిన్నారులు స్నాతకోత్సవ దుస్తులు, టోపీలు ధరించి సందడి చేశారు. ప్రీ ప్రైమరీ తరగతులు పూర్తిచేసిన చిన్నారులకు, ప్రైమరీ తరగతుల్లో చేరేందుకు అవసరమైన అర్హత పత్రాలను అంగన్‌వాడీ టీచర్ సుంచు పద్మిని అందజేశారు.